క్లుప్తంగా

27న అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి

బేతంచెర్ల: నంద్యాల రహదారిలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయ పదవ వార్షిక ఉత్సవాలు ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవా సమితి ప్రధాన కార్యదర్శి బచ్చు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, గణపతిపూజ, పుణ్యహవాచణం, రక్షాబంధనం, ఋత్వీకరణం, కళశ స్థాపన తదితర పూజలు ఉంటాయన్నారు. సాయంత్రం అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం చేస్తామన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర


అమ్మవారికి పూజలు చేస్తున్న చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: మండల కేంద్రం అవుకులో గంగమ్మ జాతర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తెలుగుపేటలో గంగమ్మ దేవతకు మత్స్యకారులు బోనాలు సమర్పించారు. వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి, బెస్త సంఘం పెద్దలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


అసోసియేషన్ అధ్యక్షురాలు మల్లిక

డోన్ రూరల్ : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ డోన్ ప్రాజెక్ట్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక నక్కిరామన్న భవనంలో ఆదివారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎంపిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, అధ్యక్షురాలిగా మల్లిక, ప్రధాన కార్యదర్శిగా స్వర్ణలత, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మస్తాన్‌బీ, కోశాధికారిగా నిర్మల, ఉపాధ్యక్షురాళ్లుగా జయలక్ష్మి, మంగమ్మ, వసంత, సహాయ కార్యదర్శులుగా విజయలక్ష్మి, సునీత, పుష్పలత, నీరజ ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, అబ్బాస్, అంగన్‌వాడీ నాయకరాళ్లు జులేఖ, చాందిని, ఎస్తేరు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ కార్యకర్త షబరాస్ ఇంటిలో ఆదివారం జరిగిన శుభకార్యానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరయ్యారు. వడుగుల అనంతరం నిర్వహించి చౌ కార్యక్రమంలో పాల్గొన్న కాటసాని షబరాస్ కుమారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అత్తార్ అఖీల్, గౌస్, పి వెంకటసుబ్బయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ కేసును విచారించిన డీఎస్పీ షర్ఫుద్దీన్

బేతంచెర్ల: పట్టణంలో ఈ నెల 19న నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించి విచారణ అధికారిగా ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్‌ను ఉన్నతాధికారులు నియమించారు. ఈ కేసుకు సంబంధించి ఆదివారం సాయంత్రం ఇరువురిని విచారించినట్లు ఎస్ఐ శివశంకర్ నాయక్ తెలిపారు.

నివాళి


శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

డోన్ టౌన్ : ముఖర్జీ బలిదన్ దివస్ సందర్భంగా ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ త్యాగాలను బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి వడ్డే మహారాజ్ గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మరియు అనుబంధ సంఘాల నాయకులు మద్దిలేటి, భరణి, రమేష్, రామచంద్రనాయుడు, వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర ఆచారి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

డోన్ రూరల్ : మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామంలో ఆదివారం రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన మాధవస్వామి నుంచి కర్ణాటక మద్యం 25టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

ఆశలు రేకెత్తిస్తున్న పత్తి సాగు..!

- అనుకూలంగా మారిన వర్షాలు
- గతేడాది క్వింటాం రూ. 10 వేలు గిట్టుబాటు ధర
- ఈ ఏడాది కలిసొస్తుందని అన్నదాత ఆశాభావం
- 2,277 హెక్టార్లలో సాగు లక్ష్యం



కోవెలకుంట్ల/బనగానపల్లె: ఖరీఫ్ సీజన్‌లో పత్తి సాగు రైతులను ఆశలు రేకెత్తిస్తోంది. గతేడాది పూత, పిందె దశలో భారీ వర్షాలతో రైతులకు నష్టం చేకూరింది. అయితే ఈఏడు వర్షాలు అనుకూలంగా మారడంతో పత్తి సాగుపైనే రైతులు మొగ్గు చూపుతున్నారు. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో 2,277 హెక్టార్లలో పత్తి సాగు సాధారణ విస్తీర్ణం. ఈ నెల 1వ తేదీ నుంచి ఖరీఫ్ ప్రారంభం కాగా వర్షాలు అనుకూలంగా మారటంతో ఆయా మండలాల పరిధిలో కావేరి, జాదు, నవనీత నూజీవీడు, ముంగారి, నరసింహ, డబుల్‌ఫోర్, హైబ్రీడ్, తదితర రకాలకు చెందిన పత్తిని సాగే చేసే పనుల్లో నిమగ్నమయ్యారు రైతులు. అదేవిధంగా నంద్యాల సబ్‌డివిజన్ పరిధిలోని బనగానపల్లె మండలంలోనూ దాదాపు వెయ్యిహెక్టార్లలో పత్తి సాగు కానుంది.

అన్ని విధాల కలిసోస్తుందని ఆశాభావం

గతేడాది విత్తనానికి ముందే వర్షాలు అనుకూలంగా మారడంతో సబ్ డివిజన్‌లోని మండలాల్లో 2,647 హెక్టార్లలో వివిధ రకాలకు చెందిన పత్తి పంట సాగు చేశారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీలు తదితర పెట్టుబడుల రూపంలో బీటీ రకానికి ఎకరాకు రూ. 20 వేల నుంచి రూ 30 వేలు, క్రాసింగ్ పత్తికి ఎకరాకు రూ. లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు వెచ్చించారు. పైరు పూత, పిందె దశలో తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. దీంతో పూత, పిందె రాలిపోయి రైతులకు నష్టం వాటిల్లింది. ఎకరాకు రూ. 15 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయనుకున్న రైతుల ఆశలపై వరణుడు నీళ్లు చల్లాడు. తుపాన్ కారణంగా ఎకరాకు రూ. 8 నుంచి 10 క్వింటాళ్లకే పరిమితమయ్యాయి దిగుబడులు. అయితే ఈ ఏడాది సీజన్ ప్రారంభంలోనే భారీ వర్షాలు కురియడంతో పత్తిసాగు అన్ని విధాలా కలిసి వస్తుందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

గిట్టుబాటు ధరతో గట్టెక్కిన రైతులు

గతేడాది భారీ వర్షాలు, చీడపీడల కారణంగా దిగుబడులు తగ్గగా మార్కెట్‌లో గిట్టుబాటు ధర రైతులను గట్టెక్కించింది. పెట్టుబడుల రూపంలో వేలాది రూపాయాలు వెచ్చించగా దిగుబడులు పది క్వింటాళ్లలోపే ఉన్నాయి. అయితే క్వింటాం రూ. 10 వేల వరకు ధర పలకడంతో రైతన్నలు గట్టెక్కారు. గిట్టుబాటు ధర మార్కెట్‌లో నిలకడగా ఉండటంతో సబ్ డివిజన్‌లోని మండలాల్లో ఈ ఏడాది సాగు విస్తీర్ణం మరింత పెరిగే ఆస్కారం ఉన్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. జూలై 15వ తేదీ వరకు పత్తి సాగుకు సమయం ఉండటంతో రైతులు విత్తన పనుల్లో నిమగ్నమయ్యారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో ఎరువులు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు కురువడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. ఈ మేరకు సాగుకు సంబంధించి రైతుభరోసా కేంద్రాల్లో అధికారులు ఎరువులు అందుబాటులో ఉంచారు. డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువులతో పాటు పురుగు మందులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు తెలిపారు.

సబ్ డివిజన్‌లో పత్తి సాగు వివరాలు

మండలం	సాధారణ విస్తీర్ణం
కోవెలకుంట	95 హెక్టార్లు
సంజామల	421 హెక్టార్లు
కొలిమిగుండ్ల	490 హెక్టార్లు
అవుకు	191 హెక్టార్లు
ఉయ్యాలవాడ	581 హెక్టార్లు
దొర్నిపాడు	1,022 హెక్టార్లు


ట్రాక్టర్‌తో విత్తనం వేస్తున్న రైతులు

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయానికి పగటిపూట వేళల్లో తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్లకు విద్యుత్ సరఫరా వేళలు వివరించారు. ముక్కమల్ల, వసంతాపురం, కమలపురి, ఆల్వకొండ, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, అక్కంపల్లె, రామిరెడ్డిపల్లె, ముక్కమల్ల, కానాల, ముదిగేడు, రెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె తదితర ఫీడర్ల పరిధిలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ తెలిపారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

కొలిమిగుండ్ల: మండలం పరిధిలోని బెలుంలో ఆదివారం ఘనంగా గంగమ్మ జాతర నిర్వహించారు. గంగమ్మ ఆలయ జీర్ణోధారణ ముగిసి 41 రోజులు పూర్తయిన సందర్భంగా జాతర నిర్వహించారు. యాదవుల ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా గంగమ్మ కథ చదివి వినిపించారు. భక్తులు పెద్ద ఎత్తున్న ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం


ఎడ్వర్డ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వైద్యులు

డోన్ టౌన్ : పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ కల్యాణ్‌బాబు, శశికుమార్, నర్సింగ్ హెడ్ సుధారాణి, సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ పిలుపునిచ్చారు. పోలియో వ్యాక్సిన్ కనుగొన్న శాస్త్రవేత్త జోనస్ ఎడ్వర్ట్ సాల్క్ వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం స్థానిక వైద్యశాలలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న పోలియో రక్కసిని రూపు మాపేందుకు అడ్వర్ట్ కనుగొన్న వ్యాక్సిన్ ప్రపంచంలో ఎందరి జీవితాలలో మార్పిందన్నారు. ఆయన చేసిన పరిశోధనలు, సేవలు చిరస్మరణీయం అని కొనియాడరు.

అద్దాల వాకిలిలో ఇరుక్కుపోయిన బాలుడి వేళ్లు!


దోర్ బోల్టులు తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

డోన్ టౌన్ : పట్టణంలోని మోర్ సూపర్ మార్కెట్‌లో సరదాగా పిల్లలను తీసుకోని షాపింగ్‌కు వెళ్లిన తల్లిదండ్రులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. తల్లిదండ్రులతో కలిసి మోర్ సూపర్ మార్కెట్‌కు వెళ్లిన బాలుడి గ్లాస్ తలుపుల మధ్య (సమాంతరంగా అయ్యే సమయంలో) ఇరుక్కుపోయింది. దీంతో ఆ బాలుడు విలవిలలాడాడు. సమాచారం మేరకు హుటాహుటిన వచ్చిన అగ్నిమాపక సిబ్బంది బోల్టులు తొలగించి గ్లాసు డోర్‌ను తొలగించారు. దీంతో ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు కుమారుడిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. మోర్ సూపర్ మార్కెట్ నిర్వాహకుల తీరును ప్రజలు తప్పుపడుతున్నారు.

ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకే వర్తింపజేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటసుబ్బారెడ్డి

డోన్ టౌన్ : అమ్మ ఒడి స్థానంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేయనున్న తల్లికి వందనం పథకం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపజేస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యను నిర్వీర్యం చేసే జీఓ నంబరు 117ను రద్దు చేయాలన్నారు. తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని, 3,4,5 తరగతుల పిల్లలకు తిరిగి ప్రాథమిక పాఠశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సుబ్బరాయుడు, జిల్లా పూర్వ గౌరవ అధక్షుడు బాబు, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన శ్రావణి

కొలిమిగుండ్ల : మండల కేంద్రం కొలిమిగుండ్లలోని షిరిడీ సాయిబాబా ఆలయ సమీపంలో ఆదివారం ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుమ్మరి సుబ్రహ్మణ్యంకు వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గంగా శ్రావణి(30)తో వివాహం అయింది. వీరికి ఇద్దరు సంతానం. సుబ్రహ్మణ్యం కూరగాయాల వ్యాపారం చేస్తూ ఉంటారు. ఉదయం కూరగాయాల తెచ్చుకునేందుకు తాడిపత్రికి వెళ్లాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో శ్రావణి ఉరివేసుకొని మృతి చెందింది. విషయం అలస్యంగా తెలియడంతో వెళ్లీ చూసే సరికి అప్పటికే మృతి చెందింది. సీఐ గోపినాథ్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉందని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తామని సీఐ తెలిపారు.



రహదారికి ఇరువైపులా పచ్చగా కళకళలాడుతున్న చెట్లు

పచ్చదనం కనువిందు!

బనగానపల్లె : ప్రసిద్ధ శైవక్షేత్రం యాగంటి రహదారి పచ్చదనంతో కళకళలాడుతుంది. క్షేత్రానికి దాదాపు రెండు కిలోమీటర్ల నుంచి రోడ్డుకు ఇరువైపులా పచ్చదనం కనువిందు చేస్తుంది. యాగంటీకుడి భక్తులకు ఆహ్లాదకరమైన గాలి స్వాగతం పలుకుతుంది. మూడేళ్ల కిందట మొక్కల పెంపకానికి ఆలయ కమిటీ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి తీసుకున్న చర్యలు సత్ఫలితాలిచ్చాయి. రహదారికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైటింగ్ సౌకర్యం కల్పించిన విషయం తెలిసిందే.


రహదారుల పక్కనే పడేసిన రాళ్లగుట్టలు



ఇష్టారాజ్యం!

కొలిమిగుండ్ల: కొందరు గనుల యాజనులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గనుల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను సైతం తవ్వేస్తున్నారు. దీంతో ఏటేటా రోడ్లు కుదించుకపోతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు 45 మీటర్ల లోపు మైనింగ్ చేయకూడదని నిబంధనలు విధించినా అక్రమార్కులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. రోడ్డుకు 45 మీటర్ల లోపు మైనింగ్ చేసినా, గనులకు సంబంధించిన వేస్టేజీని వదిలేసినా చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ అధికారులు ఏకంగా బోర్డు పెట్టినా ప్రయోజనం శూన్యంగా మారింది. రోడ్లకు రెండు మూడడుగుల దూరంలోనే లోతైన గనుల తవ్వకాలు జరిగాయి. అంకిరెడ్డిపల్లె, చింతలాయిపల్లె, బెలుం, గొర్విమానుపల్లె, బందార్లపల్లె గ్రామాల సమీపంలో రోడ్ల పక్కనే గనుల తవ్వకాలు చేపట్టారు. గనుల్లో వెలికితీసిన వేస్టేజ్ రాళ్లను ట్రాక్టర్లు, టిప్పర్ల సాయంతో రోడ్లకు ఇరువైపులా ఇష్టారాజ్యంగా పడేస్తున్నారు. రాళ్ల గుట్టలు కొండలను తలపిస్తున్నాయి. రోడ్ల వెంట తవ్విన గని గుంతలను చాలామంది యజమానులు అలాగే వదిలేయడంతో ప్రమాదకరంగా మారాయి. వాహన చోదకులు ప్రయాణించే సమయంలో గని గుంతల్లో పడి ప్రమాదాలు జరిగిన సందర్భాలు లేకపోలేదు. రెండు వాహనాలు ఎదురుగా ప్రయాణించే సమయంలో పక్కకు వెళ్లేందుకు అవకాశం లేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి వేళల్లో వాహన చోదకులు పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. భవిష్యత్‌లో రోడ్లు విస్తరణ చేపట్టాలంటే అధికారులకు సవాల్‌గా మారనుంది. ఇలాగే జరిగితే భవిష్యత్‌లో వాహనాలు ప్రయాణించే పరిస్థితి ఉండదని వాహన చోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పరిష్కార చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


బెలుం సమీపంలో రోడ్డు పక్కనే గని తవ్వి వదిలేసిన దృశ్యం


ఆర్‌అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

రిటైర్డ్ ఉపాధ్యాయుడు మృతి

డోన్ టౌన్ : రిటైర్డ్ ఉపాధ్యాయుడు పట్టణంలోని ఎస్కేపీ హైస్కూల్ సోషల్ టీచరుగా మౌలాలి (85)ఆదివారం మృతి చెందారు. స్థానిక ఎస్కేపీ హైస్కూల్ సోషల్ టీచరుగా పట్టణ ప్రజలకు, విద్యార్థులకు సుపరిచితుడు. దాదాపు నలభైఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పారు. పదవీ విరమణ అనంతరం ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. మౌలాలీ మృతి తీరని లోటని పలువురు ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు మహమ్మద్ హనీఫ్, అధ్యక్షుడు భానుసింగ్, రాష్ట్ర కార్యదర్శి ఇక్బాల్, కౌన్సిలర్ రమణ తదితరులు మౌలాలి సేవలను గుర్తు చేశారు.

నేడు ఎమ్మెల్యే కోట్ల మండలంలో పర్యటన

బేతంచెర్ల: ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి సోమవారం మండలంలో పర్యటిస్తారని టీడీపీ నాయకులు తెలిపారు. ఉదయం 7గంటలకు పట్టణంలోని హనుమాన్ నగర్, సంజీవనగర్ కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు గోరుమానుకొండ, 6 నుంచి 7గంటల వరకు సీతారామాపురంలో పర్యటిస్తారని తెలిపారు.

శ్రీశైల దేవస్థానం ఉద్యోగులకు పదోన్నతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పదోన్నతులు కల్పించినట్లు శ్రీశైల దేవస్థాన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం ఉద్యోగులకు పదోన్నతుల ఉత్తర్వులు ఈఓ అందజేశారు. రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జి.శ్రీనివాసులు, ఎస్.లోకేశ్వరప్ప, కె.అనురాధ, వి.వెంకటలక్ష్మిలకు జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. అలాగే అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.మహేష్ నాయక్‌కు రికార్డ్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన ఈఓ కు ఉద్యోగుల తరుపున ఆ సంఘం అధ్యక్షుడు ధన్యవాదాలు తెలియజేశారు.

ఘనంగా బుగ్గ వేంకటేశ్వర స్వామి రథోత్సవం


వేంకటేశ్వర స్వామి రథోత్సవం తలకించేందుకు తరలివచ్చిన భక్తజనం

సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామంలో వెలసిన బుగ్గ వేంకటేశ్వర స్వామి మహారథోత్సవం ఆదివారం కమనీయంగా సాగింది. స్వామివారి రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. మేల తాళాలు, డప్పు వాయిద్యాలతో కొలాటాల మధ్య రథోత్సవం కనుల పండువగా సాగింది. రథంపైకి అరటి, మామిడిపండ్లు విసురుతూ భక్తులు ముక్కులు చెల్లించుకున్నారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి ఇందిరమ్మ, ఆలయ ధర్మకర్త గాధం శెట్టి శ్రీరాముడు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఇరు వర్గాల ఘర్షణ.. ఏడుగురికి గాయాలు

డోన్ రూరల్ : మండల పరిధిలోని చింతలపేట గ్రామానికి చెందిన రెండు వర్గాల మధ్య ఆదివారం రాత్రి ఘర్షణ జరిగింది. పాత కక్షల నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడడంతో ఇరువర్గాలకు చెందిన ఏడుగురికి గాయాలయ్యాయి. ఓ వర్గానికి చెందిన రమేష్, అయ్యస్వామి, హుసేనప్ప, మహేష్, హరి, మరోవర్గానికి చెందిన రామాంజినేయులు, పవన్‌కు గాయాలయ్యాయి. ఇరువర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


గురూజీ దంపతులను సత్కరిస్తున్న సంఘం సభ్యులు


రక్త దానం చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ప్రతి నిత్యం యోగా, ధ్యానం అనుసరిస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పరిపూర్ణమైన జీవితం గడపవచ్చని ప్రముఖ యోగా గురువు పెనుగొండ రవిశంకర్, గాయిత్రి రవిశంకర్ దంపతులు పేర్కొన్నారు. పట్టణానికి చెందిన యోగా గురువు రాంపుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గీతా యోగాసన సంఘం 41వ వార్షికోత్సవాన్ని కేవీఎస్ కాలనీ పార్కులోని యోగా మందిర్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు యోగా, ధ్యానం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పెనుగొండ రవిశంకర్ దంపతులను ఘనంగా సత్కరించారు. సంఘం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు రక్తదానం చేశారు.